# 5. సాహిత్యంలో మీసాలు

ఆ మధ్య తెలుగు పుస్తకంలోని అచ్చుతప్పుల్లా కాస్త భయంకరంగా ఉన్న ఓ మీసాల్రావుగారు నడిబజార్లో నిలవేసేరు. ఆధునిక సాహిత్యంలోని సెంటిమెంటులా దట్టంగా అల్లుకు పోయిన తన పొడుగాటి గుబురు మీసాల్ని నవలల పోటీలో ఫస్ట్‌ప్రైజ్ కొట్టేసిన వాడి తొలిరోజుల దర్జాతో మెలేసి ఓ రెండు నిమ్మకాయల్ని వాటిమీద నిలబెట్టి, అర నిమిషం సేపు ఆడించి మరలా వాటిని భద్రంగా జేబులో వేసుకున్నారు.

ఈతతంగమంతా అయ్యాక, తనకు గిట్టనివాడి రచనను చదనకుండానే నరికి పోగులు పెట్టి, ఆ రాతకూతల్ని చదువు కుని సంతోషించేవాడి భంగిమలో నావంక చూశారు.

"సాహిత్య పిలకల్ని గురించి రాసిన మీరు సాహిత్య మీసాల్ని విస్మరించటం దురన్యాయం. పిలకలదేముంది. అడవిలో గడ్డిలా అవేపెరుగుతాయి. మా మీసాలు చూడండీ! వీటికి పాండిత్య సంపెంగ నూనెలు రాయాలి. ఒక్క తెల్ల వెంట్రుక బయటపడ్డా దానికి డబాయింపు రంగు రుద్దాలి. నిద్రలో కూడా మెలేస్తూ అందాలు దిద్దాలి, అపుడుగానీ విమ ర్శనా నిమ్మకాయల్ని వాటిమీద పెట్టి ఆడించలేము గదా! ఎంత శ్రమో, ఆలోచించండి!" అన్నారు.

మ్యాడన్ తెలుగూ సాహిత్యంలో క్రిటిక శ్రేష్టులు చాలామందే ఉన్నారు, శుభం. విమర్శనా మందులు చల్ల కుండా ఏసాహిత్య వంగడమూ నవనవంగా పెరగదు, నిజమే.

కానీ, కానీ మనకింతమంది సాహిత్య మీసాల్రాపులూ, వాళ్ళ మీసాల్నిండా సూపర్ ఫాస్ఫేటాది రోగ నివారక, చీడ నిరోధక మందులూ దండిగా ఉన్నాకూడా మన సాహిత్య స్థాయి పాతికేళ్ళనాటికన్నా అధ్వాన్నంగా ఎందుకుంది?

ఈప్రశ్న తట్టినపుడల్లా నాకోకథ గుర్తుకొస్తూంటుంది.

సినీ కవిగా అందరికీ, కథకుడుగా కొందరికి సుపరిచితులైన కీ. శే. మల్లాది రామకృష్ణ శాస్త్రిగారు పండితులుగా బహు కొందరికే పరిచితులు వారి మందహాసంవెనుక జీవితం పేర్చిన విషాదం లీలగా దాగి ఉన్నట్లే, వారి హాస్యం వెనుకా జీవితసత్యం లాంటి నిశిత వ్యంగ్యమూ దాగి ఉండేది.

ఓసారి ఓ దినపత్రిక ఆదివారం సంచికలో సారస్వతానుబంధం వండుతుండే ఓ సంపాదకుడుగారు శ్రీవారి దర్శనం చేసుకుని తలగడా సైజు తాజా పుస్తకాన్నొక దాన్ని వారి ముందుంచేరు.

"గురూజీ! ఇందులోని విషయం క్రొత్తగా ఉంది. రివ్యూకోసం పంపేరు గానీ నాకేం అర్థం గావటం లేదు. అచ్చూ, కాగితం, బైండూ ఎంత అందంగా ఉన్నాయో చూడండి. ఇంత లావుపాటి, ఖరీదయిన పుస్తకాన్ని సమీక్షించ

కుండా వదలటానికి మనసొప్పటం లేదు.... అని విన్నవించుకోగా...

మాన్యులు మల్లాదివారు ఆ తలగడాను అయిదు నిముషాల పాటు అటూ, ఇటూ తిరగేసి "బాగానే ఉంది. కష్టపడే రాసినట్లున్నాడు. పైగా ఇది గొప్ప గ్రంథమని లోపల ఓ అరడజను మంది మహామహుల సర్టిఫికేట్లు కూడా ఉన్నాయి గదా! ఇంకేం! మంచిగా రివ్యూ్యరాసి పారేసెయ్" అని శెలవిచ్చేరట.

అందుమీదట ఆ సారస్వతానుబంధకుడు గారు ఓ నాలు గున్నర కాలాల సీరియల్ నవలా పరిచయంలాంటి రివ్యూ్యలో ఆ పుస్తకాన్నీ, రచయితనూ ఆకాశానికి (స్వర్గానికి కాదు) ఎత్తేస్తూ రాసేసి, అచ్చేసి, ఆకాపీని తెచ్చి గురువుగారిముందుంచగా...

మహాపండితులు మల్లాదివారు ఓపికగా శిష్యుని నాలుగున్నర కాలాల పొడుగు పంచరత్నాలూ చదివి, భుజం తట్టి, ఓ అరకప్పు స్ట్రాంగ్ కాఫీనీ, ఓ గోల్డుఫ్లేక్ సిగరెట్టునూ బహూకరించి--వాటి సేవన అవగానే ఓ ముక్కాలిపీట సైజు పుస్తకాన్ని తెచ్చి శిష్యుని ముందుంచి, ఓ టర్కిష్ టవల్ సిద్ధంగా ఉంచి తాను తీరికగా తాంబూల సేవనలో మునిగేరు.

ఓపికగా ముక్కాలి పీటను తిరగేసిన మన సమీక్షక మీసా|లావుగారు తిరగవేత పూర్తికాగానే ఏడుపు ముఖం పెట్టేరట.

సంగతేమంటే...తాను అంత ఘనంగా కీర్తిస్తూ సమీక్ష రాసేసిన ఆ తలగడా ఈ ముక్కాలిపీటకు సంక్షిప్త కాపీ తప్ప మరేం కాదని ఆయనగారికా అరగంటలోనూ తెలుగు నవలలో ఉండేది కలలేగాని జీవితం కాదన్నంత స్పష్టంగా తేలిపోయింది.

అందుమీదట "ఇదేమిటి, గురూజీ! ఈ కాపీగొట్టు పుస్తకాన్నా నేనింతగా పొగడింది. మీరు చెప్తేనే గదా చేశాను. ఇప్పుడు నా పరువేంగాను" అని ఏడ్చేరట.

మల్లాది వారున్నూ రెడీగా ఉన్న టర్కిష్ టవల్ అందించి మరో గోల్డ్ ఫ్లేక్ సిగరెట్ ఆఫర్ చేసి

"నాయనా! అతగాడేదో తిప్పలు పడి ఆ ముక్కాలిపీటను ఈ తలగడాగా రూపొందించేడు. ఇది మాత్రం మెచ్చదగిన నైపుణ్యం గాదా! అలాగే మరెవడో డబ్బు తగలేసి అచ్చు గుద్దించేడు. అది మాత్రం త్యాగము కాదా! ఇహ, కొనటానికా! లైబ్రరీవాళ్ళు దేశం నిండా ఉన్నారు. మధ్యలో నీవూ, నేనూ, బాధపడనేల? వాడి పరువు బజార్న పడవేసి మనం వాడితో, వాడి బంధు మిత్ర పరివారంతో విరోధం తెచ్చుకోనేల? కనుక, శాంతించు..." అని సెలవిచ్చేరట.

మరో సంపాదకుడు గారున్నారు. ఆయన మీసాలు బహు శక్తివంతమైనవి. ఎందరో సాహితీ వేత్తల్నాయన తన మీసాల మెలికల్లో ఇరికించి నలిపి, పిసికి, పిండి మిగిలిన పీచును

చెత్తకుండీలోకి విసిరేశారు. దాంతో అజాగ్రత్తగానో, అతి తెలివిగానో రాసే వాళ్ళంతా హడలిపోయి నిద్రలోగాక, మెలుకువలోనే వ్రాయటం మొదలెట్టేరు. ఆ మాత్రం ఓపిక లేనివాళ్లు ఆయన మిసాల్ని ఎదిరించగల మీసాల్ని పెంచలేక కాళ్ళు విరగ్గొడుతాం, బుర్రలు బద్దలు కొడతాం ఖబడ్దార్! అంటూ ఆకాశ రామన్న లేఖల్లో అప్పీళ్ళు పెట్టుకున్నారు. ఆయన గారేమో ఆ ఉత్తరాలకు ఫ్రేములు కట్టించి ఆఫీసులో తగిలించి నవ్వుకున్నారు.

అలాంటి మీసాల్రావు గారికి ఓ యువ రచయిత తన తాజా గ్రంథం పంపి 'దీన్ని మీరు సరికి పోగులు పెడితే చూసి లోపాలు తెలుసుకుని దిద్దుకుందామనుందండీ!" అని అభ్యర్థించగా...

ఆయనగారు... నాయనా "నీ పుస్తకంలోని విషయం నాకు పరిచయం లేనిది. నా అవగాహనలో లేనిదాన్ని గురించి నేనేం చర్చించను. చదివి తెలుసుకుని ఆనందించగలను!అంతే! అని జవా బిచ్చేడట.

ఈ రెండు కథలనూ పోల్చి చూసుకోండి. మొదటి మీసాల్రావుగారికి ఏ వూరెళ్ళినా విందులు దండిగా తగులుతాయి. రెండో మీసాల్రావుగారికి ఉన్న ఊళ్ళోనే విరోధులున్నారు.

పాఠక మహాశయులారా! ఇప్పుడు ఆలోచించండి.మన

సాహిత్య సౌరభం ముక్కు మూసుకొని మరీ ఆస్వాదించాల్సినంత సుగంధ భరితంగా ఉందంటే అందుకు దోహదకారు లెవరు?

తెలిసికూడా ధైర్యంగా పైకి చెప్పలేకపోయారో మీకు నూరు తాజా తెలుగు కథలూ, డజన్ నవలలూ చదవాల్సిన పాపం చుట్టుకోగలదు జాగ్రత్త.

(జూన్ 1971)